క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న దేవస్థానం ఉద్యోగి రాము

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని హెచ్‌బీకాలనీకి చెందిన మద్దిల రామారావు, లక్ష్మి దంపతులు లక్షా 1116 రూపాయిల విరాళం ఇచ్చారు. సింహగిరిపై ఉన్న మే ఐ హెల్ప్ యు కేంద్రంలో నగదు రూపంలో దేవస్థానం ఉద్యోగి రాముకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు.

మండల పరిషత్ ఏవోగా రాంబాబు

పరవాడ: మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఏవోగా జి.వి.రాంబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన అరకు ఏవోగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడి ఏవో ఆశాజ్యోతి పదోన్నతిపై బదిలీ అయ్యారు.

గెడ్డ వాగులో ఆక్రమణల తొలగింపు



మొగలిపురం గెడ్డ వాగులో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని మొగలిపురం రెవెన్యూ పరిధిలోని గెడ్డ వాగు ఆక్రమణకు రెవెన్యూ అధికారులు చెక్‌పెట్టారు. మొగలిపురం సర్వే నెంబరు 176/2లోని గెడ్డ వాగును స్థానికులు ఆక్రమించుకున్నారు. దాని నుంచి ప్రైవేటు భూముల్లోకి రోడ్డు వేయడానికి వీలుగా కల్వర్టు నిర్మిస్తున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ బి. సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో జ్యోతి శనివారం సంబంధిత ఆక్రమణను అడ్డుకున్నారు. పొక్లెయిన్ సహాయంతో కల్వర్టు నిర్మాణాన్ని తొలగించారు. గెడ్డ వాగును ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం



గంప గోపి

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం బీసీ కాలనీకి చెందిన గంప గోపి అదృశ్యమయ్యాడని పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదైంది. హెచ్‌సీ సత్యనారాయణ అందించిన వివరాలు.. ఈనెల 22వ తేదీన ఉయం 9.30 గంటల సమయంలో గోపి ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గోపి భార్య వెంకటలక్ష్మి శనివారం ఫిర్యాదు చేశారు. గోపి ఆచూకీ తెలిసినవారు 0891-2764233లో సంప్రదించాలని హెచ్‌సీ సత్యనారాయణ కోరారు.

కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ముత్యాలు ఎన్నిక

పెదగంట్యాడ: శ్రీకృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జెర్రిపోతుల ముత్యాలు ఎన్నికయ్యారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు రామాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తలారి వెంకటరమణ, వర్కింగ్ అధ్యక్షునిగా కర్ణం బాబూరావు ఎన్నికయ్యారు. మిగిలిన కార్యవర్గాన్ని 11 రోజుల్లో నియమించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

27న సింహగిరిపై వరదపాయసం సేవ

సింహాచలం: సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్టుపై ఈనెల 27న వరదపాయసం సేవ నిర్వహించనున్నట్టు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో డి.భ్రమరాంబ తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పంటలు బాగా పండాలని సింహగిరి వైకుంఠవాసుడి మెట్టుపై కొలువుదీరిన వైకుంఠవాసుడి సన్నిధిలో వరదపాయసం సేవ నిర్వహించడం పూర్వకాలం నుంచి వస్తోందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి వరదపాయసం సేవ ఉంటుందని తెలిపారు. వైకుంఠవాసుడికి విశేష పూజలు, పంచకలశ స్నపనం, పాయసం నివేదన ఉంటాయన్నారు. అనంతరం జారుడుబల్ల ఆకారంలో ఉండే కొండపై నుంచి పాయసం జారవిడవడం జరుగుతుందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జగనన్న సురక్షతో మిగిలి పోయిన వారికి లబ్ధి
- కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి



ఎంపీడీవో రమేష్ నాయుడుకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వివిధ కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని వారికి ఇప్పుడు అందించేందుకు అవకాశం లభిస్తుందని కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి తెలిపారు. జగనన్న సురక్ష ప్రారంభం సందర్భంగా మండలంలోని తవ్వ వానిపాలెంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో శనివారం ఆయన సమీక్షించారు. ఇంటింటికీ తిరిగి వలంటీర్లు సేకరించిన సమాచారాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. తొలి రోజు గ్రామంలో 84 దరఖాస్తులు వచ్చాయని వలంటీర్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నెలరోజుల పాటు నిర్వహించడానికి వీలుగా ఎంపీడీవో, తహసీల్దార్ పర్యవేక్షణలో రెండు టీములు ఏర్పాటు చేశామన్నారు.

ఈ రెండు టీంలోని అధికారులు ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు సేకరించిన సమాచారం ప్రకారం ప్రభుత్వ పథకాలకు, సంక్షేమ కార్యక్రమాలకు అర్హత ప్రామాణికంగా ఎంపిక చేస్తారని తెలిపారు.ఏ కారణం చేత గతంలో ఎంపిక కాలేదో పునఃసమీక్షిస్తారని చెప్పారు. సాంకేతిక కారణాలతో పథకాలు అందలేదని గుర్తిస్తే వెంటనే వారిని సంక్షేమ పథకాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు

ఆయా గ్రామాల వారీగా నిర్ణయించిన తేదీలకు వారం రోజులు ముందుగా జగనన్న సురక్ష యాప్ ఓపెన్ అవుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను ఆన్‌లైన్ లిస్టులో పేర్కొన్న వెంటనే వారికి ఆయా పథకాలు మంజూరు అవుతాయని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్‌నాయుడుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కిరణ్ కుమారి, తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు బోకం బాలు, ఉపసర్పంచ్ వనం దేవుడు బాబు, ఈవోఆర్డీ కె. మహేష్, ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు మేలు



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న రవికుమార్

పరవాడ: సేంద్రియ పద్ధతిలో సాగు చాలా అవసరమని రీసస్టైనబులిటీ సంస్థ ప్రతినిధి కె.రవికుమార్ అన్నారు. కలపాక శివారు స్వయంభూవరంలో రీసస్టైనబులిటీ సహకారంతో రాంకీ ఫౌండేషన్ అమలు చేస్తున్న సేంద్రియ వరి సాగులో భాగంగా శనివారం రైతులకు వరి విత్తనాలు, సేంద్రియ ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధి పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా ఆహార పంటలు కూడా కలుషితమవుతున్నాయన్నారు. వాటిని తిన్న వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా సేంద్రియ సాగును ప్రోత్సహించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. స్వయంభూవరంలో మూడేళ్లుగా అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా మంచి ఫలితాలు సాధించామని రాంకీ ఫౌండేషన్ హెడ్ శ్రీకాంత్ ఆనందం వ్యక్తం చేశారు. ఫౌండేషన్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో చంద్రావతి కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎల్ హెచ్ఆర్ మేనేజర్ శివారెడ్డి, వ్యవసాయ సహాయకులు అనిత, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీలో ఉద్యోగాల భర్తీకి 27న ఇంటర్వ్యూలు

గాజువాక: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో వర్చువల్ రిలేషన్‌షిప్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఈ నెల 27న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఎన్ఐబీటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు. 2020, 2021 సంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు ప్రస్తుతం డిగ్రీ, పీజీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు కూడా ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ పదో తరగతి నుంచి అన్ని తరగతుల్లోను కనీసం 50 శాతం మార్కులను పొంది ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి కనీస వేతనం రూ.4.64 లక్షల ప్యాకేజీ ఉంటుందని తెలిపారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీఆర్ఎస్ఐ జాతీయ కార్యదర్శిగా పీఎల్‌కే మూర్తి



ఎన్నికైన సభ్యులు

కొమ్మాది: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల ప్రజా సంబంధాల అధికారులు సభ్యులుగా గల భారత ప్రజా సంబంధాల సంఘం (పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా) జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పీఎల్‌కే మూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు న్యూ ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో శనివారం జరిగిన ఎన్నికల్లో ఆయనను ఎన్నికల అధికారి సుభాష్ సూద్ ప్రకటించారు. జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ అజిత్ పాఠక్ ఎన్నికయ్యారు. దక్షిణ భారత విభాగానికి విశాఖకు చెందిన హెచ్‌పీసీఎల్ విశ్రాంత అధికారి యూఎస్ శర్మ ఎన్నికయ్యారు. జాతీయ కార్యదర్శిగా ఎంపికైన డాక్టర్ పీఎల్‌కే మూర్తి విశాఖ పి.ఐ.ఎస్.ఐ చైర్మన్‌గా, కార్యదర్శిగా సేవలు అందించారు.

వైఎస్సార్ జయంతి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు



ఏర్పాట్లపై పార్టీనాయకులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: వచ్చేనెల 8న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను 95వవార్డు పరిధి పురుషోత్తపురంలోని బాలాజీ హైఫీల్డ్ స్కూల్ సమీపంలోని విశాల ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. ఏర్పాట్ల విషయమై శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి అదీప్‌రాజ్ మైదాన్ని పరిశీలించారు. నియోజకవర్గస్థాయిలో జరిగే వేడుకలను పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలంతా విజయవంతం చేయాలని కోరారు. వేడుకలకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, పెందుర్తి, సబ్బవరం మండల పార్టీ అధ్యక్షులు నక్క కనకరాజు, కర్రి బాబు, 94వవార్డు అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, బోకం రామునాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

జిల్లా ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న సీడీఎంఏ కోటేశ్వరరావు, కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: నగరంలోని యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేక అధికారి పి.కోటేశ్వరరావు ఆదేశించారు. పదో వార్డు వివేకానందనగర్‌లో యూపీహెచ్‌సీని శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావుతో కలసి ఆయన సందర్శించారు. ఇక్కడ యూపీహెచ్‌సీని పరిశీలించారు. ఏ ఏ వైద్య సేవలు అందుతున్నాయి? ఎంతమంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు? ఇక్కడ మందులు, పరికరాలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు తదితర వాటి గురించి డీఎంహెచ్‌వోని అడిగి తెలుసుకొన్నారు. ఇక్కడకు వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్య సేవలుపై ఆరా తీశారు. రోజూ ఓపీ ఎంత నమోదువుతోందో అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బందిపడకుండా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగుల తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్శనలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు శ్రీనివారావు, డాక్టర్ సన్యాసిరావు, జోన్-2 జెడ్సీ కనక మహలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

ఎంపీపీ సూర్యకుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: ఉపాధ్యాయులంతా అంకితభావంతో పని ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఈవో ఎస్. అప్పలరాజు అధ్యక్షతన శనివారం మండల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడంతో పాటు జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద అందించి పేద విద్యార్థుల ఉన్నతికి పాటు పడుతుందన్నారు. ఎంపీడీవో రమేష్ నాయుడు మాట్లాడుతూ విద్యాప్రగతిలో మండలం జిల్లాలో మొదటి స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. డ్రాపౌట్స్ లేకుండా శత శాతం విద్యార్థులను నమోదు చేసుకొని, గుణాత్మక విద్య అందించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో- 2 బి.సూర్యనారాయణ మూర్తి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ మహేష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

బొండా కుటుంబ సభ్యులకు పరామర్శ



బొండా వెంకట సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న రమేష్ బాబు

మహారాణిపేట: ప్రమాదవశాత్తు మృతి చెందిన అవయవదానం చేసిన బొండా వెంకట సంతోష్ కుమార్ (వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు సోదరుడు) కుటుంబ సభ్యులను పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు రీజినల్ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కొరికాణ మోహన్‌రావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచందర్, సీనియర్ నాయకులు వానపల్లి ఈశ్వరరావు, చొక్కర శేఖర్, జి.విక్టర్, వెంకట్, ధూళి రఘు, నల్లా రవి, పతివాడ కనకరాజు ఉన్నారు.

అందరి మేలు కోసమే 'జగనన్న సురక్ష'

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సింహాచలం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకం చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశ్యమని, దీనిలో భాగంగానే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. చినముషిడివాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం జగనన్న సర్వే కార్యక్రమంపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించారన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగా నే నెరవేర్చారన్నారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజా సమస్యలను, పథకాలు అందుతున్న తీరును తెలుసుకుంటున్నామని చెప్పా రు. అయితే అర్హత ఉండి ఏ ఒక్కరూ సంక్షేమ పథకానికి దూరం కాకూడదనే ధ్యేయంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రతీ గ్రామంలో ఏ చిన్న సమస్య ఉన్నా దాన్ని పరిష్కరించడానికి సచివాలయ సిబ్బంది, మండలస్థాయి సిబ్బంది, ఐఏఎస్ అధికారులు, గృహసారథులు, సచివాలయ కన్వీ నర్లు ప్రతీ ఇంటికి వెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైలపుడి భ గవాన్ జయరామ్, పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పెందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, పార్టీ నాయకులు కొటాన రాము, సబ్బవరపు ముత్యాలు పాల్గొన్నారు.

పరవాడలో..



పరవాడలో జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, వలంటీర్లు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.కనకారావు కోరారు. పరవాడ గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ పద్మజ, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి అచ్చుతరావు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. అర్హత ఉండి పథకాలు పొందలేని పేదలను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అలాగే పెదముషిడివాడ, కన్నూరు, వెన్నలపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, కోరుకొండ వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా గడప గడపకు..



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: దేశపాత్రునిపాలెంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మూడో రోజు శనివారం గ్రామంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రజలను స్వయంగా కలిసి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని చదివి వినిపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పాలన కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 79 వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, పూర్ణానందశర్మ, కర్రి వినోద్‌కుమార్, పండూరి వెంకటరమణ, డి.వి.రమణ, లక్కరాజు రాము, రేబాక నరేష్, కల్యాణి, ఎల్లపు ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యారంగానికి పెద్ద పీట

కార్పొరేటర్ ముమ్మన దేముడు



విద్యార్థులకు జగనన్న కిట్లు అందజేస్తున్న ముమ్మన దేముడు

సింహాచలం: ప్రతీ విద్యార్థి చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్న లక్ష్యంతో విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. పురుషోత్తంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జగననన్న విద్యా కానుక కిట్లను దేముడు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముమ్మన మాట్లాడుతూ 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి విద్యారంగంలో పెను మార్పులు వచ్చాయన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ప్రతీ చిన్నారి చదువుకోవాలన్నదే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు ఉండాలన్న ధ్యేయంతో నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. మధ్యాహ్న భోజనం అమల్లో అనేక మార్పులు తీసుకొచ్చి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. పిల్లలంతా చక్కగా చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవుళ్లు, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, స్కూల్ కమిటీ చైర్మన్ కవిత, కోఆప్షన్ సభ్యుడు ఆబోతు శ్రీను, చందు యాదవ్, నాయకులు శ్రీను, సాయికృష్ణ, విజయేంద్ర, రాజు, లక్ష్మి, భవాని, శ్రీను పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నియంత్రణ

- రహదారి నిబంధనలపై విస్తృత ప్రచారం
- జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్



అవగాహన సదస్సులో మాట్లాడుతన్న జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్

గోపాలపట్నం: అవగాహనతోనే ప్రమాదాలను నియంత్రించవచ్చునని జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్ అన్నారు. శనివారం ఎన్ఏడీ సమీపంలోని ఎన్ఎస్‌టీఎల్ జంక్షన్ వద్ద మహిళా పోలీసులు, ఆటో డ్రైవర్లకు రహదారి నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణకు రాష్ట్రప్రభుత్వం, పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. వాహన చోదకులతో పాటు పాదచారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగా హన కల్పించాలని సూచించారు. మహిళా పోలీసులు ఇందులో కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆయా సచివాలయం పరిధిలో ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. అలాగే నేరాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నా రు. నేరాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్న అనుమా నం ఏర్పడినా సమాచారమిస్తే దాన్ని అడ్డుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మీ ప్రాంతాల్లో ఏచిన్న విషయమైనా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారమివ్వాలన్నారు. జీబ్రాలైన్స్‌పైనే వెళ్లాలని పాదచారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఆక్రమణలు తొలగించండి

ఫుట్ పాత్ ఆక్రమణలు ఉంటే సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శుల సహకారంతో తొలగించాలని సూచించారు. అవసరమైతే ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మనం పని చేయాలన్నారు.

నిబంధనలు పాటించాలి

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఆటోలు నడపడం.. రోడ్డుపై అడ్డంగా నిలిపి వేయడం వంటివి చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అతి వేగం, దురుసుగా ప్రవర్తించడం వల్ల నిత్యం ప్రమాదాలు జరరుగుతున్నాయని తెలిపారు. నగరంలో ఆటోల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని సూచించారు. అన్ని పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు మళ్ల అప్పారావు, అశోక్ కుమార్, ఉమామహేశ్వరరావు శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ గురజాడనగర్‌కు చెందిన యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదైంది. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ సీఐ బీఎండీ ప్రసాద్ తెలిపిన వివరాలు..ఈ నెల 20న బాలిక తప్పి పోయిందని బాలిక తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు సెల్‌ఫోన్ ట్రాకింగ్ ద్వారా విజయనగరం జిల్లా గజపతినగరంలో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్లి బాలికను కిడ్నాప్ చేసిన సోమాదుల పవన్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లి దండ్రులతో ఇంటికి పంపించారు. పవన్‌కు ఏడాది కిందటే వివాహమయింది. అయినా మైనర్ బాలికను ప్రేమించానని నమ్మించి మాయమాటలు చెప్పి తీసుకు పోయాడని బాలిక తల్లి దండ్రులు వాపోతున్నారు. మైనర్ బాలికను తీసుకెళ్లిన పవన్‌పై ఎయిర్‌పోర్టు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: మహనీయుల త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 863వ రోజు శనివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాసితులు రోడ్డున పడ్డారని, వారిలో కొంతమందికి మాత్రమే కాంట్రాక్ట్ వర్కర్లుగా ఉపాధి లభించిందని, మిగిలిన వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే వారికి అన్యాయం జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
7997958341, 9912440606

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com